సాక్షి ప్రకాశం

ఆదివారం । 22 । జూన్ । 2025



కబళించిన అతివేగం

బేస్తవారిపేట మండలం చెట్టిచర్ల సమీపంలో ట్రాన్స్‌పోర్ట్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొని ఒక మహిళ మృతిచెందగా, ఆమె భర్త ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. - 8లో..



గంజాయి కేసులో ఆరుగురు అరెస్టు

గంజాయి కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు శనివారం గిద్దలూరులో విలేకరుల సమావేశంలో తెలిపారు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38 /28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై బ్యాంకర్లకు అవగాహన



బ్యాంకర్లతో మాట్లాడుతున్న ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ

ఒంగోలు టౌన్: సైబర్ నేరాలను సకాలంలో పసిగట్టి వెంటనే అప్రమత్తం అయితే నష్టం జరగకుండా చేయవచ్చని ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ చెప్పారు. సైబర్ నేరాల నివారణపై శనివారం నగరంలోని బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజల అత్యాశ, భయాందోళనలను ఆసరా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు తెగబడుతున్నారని చెప్పారు. అపరిచితుల నుంచి వచ్చే ఎస్ఎంఎస్, ఈ మెయిల్స్, వాట్సప్‌లో వచ్చే లింకులును ఓపెన్ చేయడానికి ముందు అన్నీ రకాల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బ్యాంక్ రివార్డులు, ఇతర మోసాల గురించి బ్యాంకు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని, కస్టమర్లను అప్రమత్తం చేయాలని చెప్పారు. సమావేశంలో నగరంలోని అన్నీ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల మధ్య మాటల యుద్ధం



బీజేవైఎం ఐటీ రాష్ట్ర కన్వీనర్ జీవీరెడ్డితో మాట్లాడుతున్న ఎంపీడీఓ జాన్‌సుందరం

పెద్దారవీడు: అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా పెద్దారవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీ నాయకులకు బీజేవైఎం నాయకులకు మధ్య శనివారం ఉదయం వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యక్రమానికి టీడీపీ నాయకులు బీజేఎంవై నాయకులు హాజరయ్యారు. బీజేవైఎం ఐటీ రాష్ట్ర కన్వీనర్ జీవీరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మా పార్టీ కూడా ఉందని, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో ఉండాలని, కార్యక్రమానికి పిలిచి అవమానం చేయడం ఏమిటని ఎంపీడీఓను ప్రశ్నించారు. ఆ విషయంపై ఎంపీడీఓ బీజేవైఎం నాయకులకు నచ్చ చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జోక్యం చేసుకొని ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాల్సిన అవసరం లేదని, అసలు మిమ్మల్ని ఎవరు పిలిచారు, ఎందుకు వచ్చారని, మీరు ఇక్కడ నుండి వెళ్లిపోవాలని, చేతనైతే మీ నాయకుడు మోదీకి చెప్పుకోవాలని, నీవు ఏం చేసుకుంటాయో చేసుకో అని కొంత సేపు దుర్భాషలాడుతూ ఆవేశంగా మాట్లాడారు. బీజేవైఎం నాయకుడు మాట్లాడుతూ ''అధికారులు పిలిస్తే కార్యక్రమానికి వచ్చామని, నీవు ఎవరు మమ్మల్ని వెళ్లిపొమ్మనడానికి, నీవు బెదిరిస్తే బెదిరి పోవడానికి లేము, మాటలు జాగ్రత్తగా మాట్లాడు'' అని ఘాటుగా ఎదురు మాట్లాడారు. ఈ విషయంపై పార్టీ నాయకులకు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేవైఎం నాయకులు జీవీరెడ్డితో పాటు బీజేవైఎం జిల్లా కార్యదర్శి వాయిరి రామకృష్ణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు పాలంకయ్య తెలిపారు. ఎంపీడీఓ జాన్‌సుందరం వివరణ కోరగా బీజేవైఎం నాయకులకు యోగా కార్యక్రమానికి హాజరు కావాలని సమాచారం ఇచ్చామని, వారు కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. రెండు పార్టీల నాయకులకు సర్దిచెప్పామన్నారు.

అర్హులు విస్తుపోయి.. ఖాతాలు బోసిపోయి!

తల్లికి వందనం అంతా గందరగోళంగా తయారైంది. జిల్లాలో దాదాపు లక్ష మందికి ఈ పథకాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టింది. పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు, పది, ఇంటర్ రెండో సంవత్సరం పాసైన విద్యార్థులు, కేంద్రియ విద్యాలయం విద్యార్థులు ఇలా చాలా మంది పేర్లు గల్లంతయ్యాయి. ఏం జరిగిందో తెలియక, సరైన సమాధానం చెప్పేవారు లేక ఆందోళన చెందుతున్నారు. విచిత్రమేమిటంటే చాలా మంది విద్యార్థులకు రూ.10,900 పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ఎంత మంది అర్హులు, ఎంత మంది అనర్హులు అనే విషయాన్ని చెప్పేవారే కరువయ్యారు. సంబంధిత విభాగ జిల్లా అధికారులను అడిగినా మాట దాటేస్తున్నారు.

- చాలా మంది తల్లుల ఖాతాలో రూ.10,900
- ఎందుకీ కోతలంటూ విస్తుపోతున్న లబ్ధిదారులు
- కేంద్రియ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యార్థుల పేర్లు మాయం
- ఇంటర్, పది పాసైన విద్యార్థులకు శఠగోపం
- పారిశుద్ధ్య కార్మికులకు అందని పథకం
- వివరాల వెల్లడిలో అంతా గోప్యం



ఇద్దరు పిల్లల్లో ఒకరికే వచ్చింది

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఇస్తామని ఇప్పుడు మోసం చేసింది. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి పదో తరగతి పూర్తయింది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. పిల్లకు తల్లికి వందనం పడలేదు. అబ్బాయి 3వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరిలో ఒకరికే తల్లికి వందనం వచ్చింది. సచివాలయంలో అర్జీ ఇచ్చాం.

– మీసాల శ్రీదేవి, ఆలకూరపాడు గ్రామం, టంగుటూరు గ్రామం.

ఒంగోలు సిటీ:

తల్లికి వందనం రాని వారి సంఖ్య జిల్లాలో రోజు రోజుకూ పెరుగుతోంది. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామంటూ ఎన్నికల్లో కూటమి నేతలు హామీలు గుప్పించారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లతో పాటు జిల్లా స్థాయి నేతలు హామీ ఇచ్చారు. ఎప్పటిలాగే అధికారంలోకి వచ్చాక నాలుక మడతెట్టేశారు. రూ.15 వేల నుంచి రూ.13 వేలకు కుదించగా చాలా మంది లబ్ధిదారులకు రూ.10,900 బ్యాంకు ఖాతాల్లో పడుతుండడంతో విస్తుపోతున్నారు. ఇదేమని అడిగితే సరైన సమాధానం చెప్పేవారే కరువయ్యారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారిళ్లల్లో కూడా ఒక్కరికే తల్లివందనం నగదు జమైన సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ సుమారు సుమారు 3,74,939 మంది విద్యార్థులు ఉన్నారు. 2,65,559 మంది విద్యార్థులను మాత్రమే అర్హులుగా చేర్చింది. రకరకాల నిబంధనల పేరుతో సుమారు 1,09,380 మందికి ఎసరుపెట్టింది.

తల్లికి వందనం నగదు పడలేదు



నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఒక బాబు, ఒక పాప. కుమారుడు ఈ ఏడాది పదో తరగతి చదవాల్సి ఉంది. కుమార్తె 8వ తరగతిలో ప్రవేశించింది. కుమార్తె వాకా భవ్యశ్రీకి తల్లికి వందనం నగదు నా ఖాతాలో జమైంది. కానీ కుమారుడు వాకా వెంకట లీలా వర్ధన్‌రెడ్డికి మాత్రం తల్లికి వందనం నగదు జమ కాలేదు. నా కుమారుడు పేరు అర్హుల జాబితాలో లేదు. అనర్హుల లిస్టులో కూడా లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లా, అర్జీ పెట్టుకోమన్నారు. మద్రిపూడి సచివాలయంలో అర్జీ పెట్టుకున్నా. నా కుమారుని పేరుతో తల్లివందనం నగదు జమ అవుతాయో, కావో తెలియడం లేదు.

– వాకా యశోద, మద్రిపూడి

పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం..

ఉదయం లేవగానే ఇంటి ముందు చెత్తను తీసేసి వీటిని శుభ్రంగా ఉంచే కార్మికులను కూడా ప్రభుత్వం వదల్లేదు. అంత గొప్ప పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కూడా తల్లికి వందనం ఎగ్గొట్టింది. జిల్లాలో సుమారు 3,500 మంది పారిశుద్ధ్య కార్మికులు పగలనకా రేయనక చాలీచాలని జీతంతో పస్తులుండి పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. ఇలాంటి వాళ్ల మీద కూడా కూటమి ప్రభుత్వానికి దయ లేదంటే ఏం చేయాలో తెలియడం లేదని కార్మికులు వాపోతున్నారు.

కేంద్రియ విద్యార్థులకు దూరం..

జిల్లాలో ఒంగోలు, పెద్దారవీడు మండలం రాజంపల్లిలో కేంద్రియ విద్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో 2500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో దాదాపు 40 శాతం మంది విద్యార్థుల పేర్లను ఈ పథకం నుంచి గల్లంతయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీరికి అమ్మఒడి ద్వారా ఆర్థిక సాయం అందింది. కూటమి ప్రభుత్వం మాకు ఎందుకు ఇవ్వడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు కేంద్రం ఎదుట సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన కూడా చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఏం జరుగుతుందో చెప్పేవారు కరువయ్యారు.

ఇంటర్, పది విద్యార్థులకు కోత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రకటించిన హామీలు అమలు చేసి ఉంటే గత ఏడాది ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకం వర్తించేది. నేడు ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరికీ ఈ పథకం దూరమైంది. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ రెండో సంవత్సరం చదివిన వారు 20,815 మంది ఉన్నారు. వీరిలో ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువులకు పొరుగు ప్రాంతాలకు వెళ్లిన, ఫెయిలైన విద్యార్థులు ఈ పథకానికి పూర్తిగా దూరమైనట్లే. అలాగే జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 29,602 మంది ఉన్నారు. వీరికి సైతం డబ్బులు పడలేదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో అలవికాని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఇలా మోసం చేయడం తగదని వారు మండిపడుతున్నారు.

గోప్యత పాటిస్తున్న అధికారులు..

జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల్లో తల్లికి వందనం జాబితాలను అందుబాటులో ఉంచారు. 597 గ్రామ, 122 వార్డు సచివాలయాల్లో ఉంచిన జాబితాలను చూసి చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. అనర్హుల జాబితాల్లో తమ పేర్లు ఉండడంతో వారు నిర్ఘాంతపోతున్నారు. ఈ పథకం లబ్ధిదారుల విషయంలో సంబంధిత శాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. జిల్లాలో రానివారు చాలా మంది సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పేవారు కరువయ్యారు. పథకం రాని వారు సచివాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోండి అంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. 20వ తేదీతో ఆ సమయం కూడా ముగిసిపోయింది. ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో సమాచారం చెప్పమన్నా దాటవేస్తున్నారు.

జవహర్ నవోదయ విద్యార్థుల పేర్లూ గల్లంతు..

జవహర్ నవోదయలో చదువుతున్న విద్యార్థుల పేర్లు సైతం గల్లంతయ్యాయి. జిల్లాలో ఒంగోలు నగరం, తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో జవహర్ నవోదయ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 544 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి పేర్లు సైతం తల్లికి వందనం పథకంలో లేవు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఒరిగిందేంటి ?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ జిల్లా మహాసభలు



మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

దర్శి(కురిచేడు): కూటమి ప్రభుత్వం అప్పులు తీసుకురావటానికి ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్ని మార్గాలను శోధిస్తోందని అమరావతి రాజధాని పేరుతో రూ.31 వేల కోట్లు అప్పులు తెచ్చారని, మరో రూ.31 వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని డబుల్ ఇంజన్ సర్కార్తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. సీపీఐ జిల్లా 17వ మహాసభలు దర్శిలోని సానికొమ్ము కాశిరెడ్డి సభా ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీపీఐ సీనియర్ నాయకులు అందె నాసరయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశంలో ఏ సమస్య పరిష్కారం అయిందో ప్రధాని మోదీ చెప్పాలని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదని, నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోందని, రైతులకు గిట్టుబాటు ధరలు దక్కటంలేదన్నారు. నేటికీ దేశంలో 14 కోట్ల మందికి రోజువారీ ఆదాయం రూ.50 – రూ.100లోపే ఉంటుందని పేర్కొన్నారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వడ్డీ సంస్థలు దేశంలో పేదరికం తగ్గిందని చెప్పటం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ ఆస్తులు గణనీయంగా పెరిగాయన్నారు. వ్యవసాయ ఆధారిత దేశమైన భారత దేశంలో 55 శాతం మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు తమ పాలన సుస్థిరం చేసుకునేందుకు కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. జగన్ పాలనలో అదాని స్మార్ట్ మీటర్ వద్దన్న టీడీపీ నాయకులు నేడు అవే ముద్దంటూ ఎందుకు పేర్కొంటున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. వెలుగొండ ప్రాజెక్టు వంటి చిన్న ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టకుండా పోలవరం, బనకచర్ల వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం వైపే చంద్రబాబు మొగ్గుచూపటం ఎవరిప్రయోజనాల కోసం అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమలు నిర్వీర్యం చేసి దాని స్థానంలో మిట్టల్ ప్రైవేటు ఉక్కు పరిశ్రమకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు మోదీకి ఈవెంట్ మేనేజర్ గా పనిచేస్తున్నారన్నారు. యోగాను దేశమంతా జరుపుకుంటుండగా కేవలం విశాఖపట్నంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి నెలరోజులుగా ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిదులు నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారన్నారు. యోగాంధ్ర వలన ప్రజా సమస్యలు తీరవని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. అధికారంలో లేకుండా ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేస్తూ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమేనని రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లాలో అధికారపార్టీకి చెందిన అనేక మంది ప్రజా ప్రతినిధులున్నారని, ఒక్కరు కూడా జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు గురించి కానీ, కనిగిరి నిమ్జ్ గురించి గానీ, దొనకొండ పారిశ్రామికవాడ గురించి గానీ చట్టసభల్లో ప్రశ్నించిన నాయకుడు లేడన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు అందె నాసరయ్య, నెల్లూరు జిల్లా కార్యదర్శి వెంకయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కార్యవర్గసభ్యులు ఆర్ వెంకట్రావు, వడ్డె హనుమారెడ్డి, కే వీరారెడ్డి, ఆర్ రామకృష్ణ, యాసిన్, రమేష్, లక్ష్మి, ఎం విజయ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పామూరులో జేవీవీ జిల్లా మహాసభ

పామూరు: జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు పామూరులోని మయూరి ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు షేక్.గయాజ్‌బాషా పేర్కొన్నారు. మహాసభలకు జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావుతోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



అండర్ 16 ప్రకాశం జిల్లా బాలుర క్రికెట్ జట్టు

ఉత్సాహంగా అండర్ 16 జిల్లా క్రికెట్ జట్టు

ఒంగోలు: అండర్ 16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్థానిక మంగమూరు డొంకలోని ఏసీఏ సబ్ సెంటర్లో శనివారం నిర్వహించిన ఎంపిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి దాదాపు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమికంగా హాజరైన వారి నుంచి 26 మందిని ఎంపిక చేశామన్నారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల ఆర్‌సీఏ గ్రౌండ్‌లో ఈనెల 26 నుంచి ప్రాబబుల్స్ మ్యాచ్‌లు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారితో తుది జట్టును ప్రకటిస్తారన్నారు. జూలై 3 నుంచి 13వ తేదీ వరకు మంగళగిరి/ పేరేచర్లలో జరిగే ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీలో ప్రకాశం జిల్లా తరపున ఎంపికైన జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ ఎంపిక కార్యక్రమాన్ని కోశాధికారి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి బచ్చు శ్రీనివాసరావు, బలరాం, రామకృష్ణారెడ్డి, కత్తిశివ, నల్లూరి రవి, ఉండవల్లి రాము, కోచ్‌లు సుధాకర్, చంద్ర, సెలెక్టర్లు శ్రీకృష్ణ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

ఆరోగ్య యోగం



యోగాసనం వేస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్, జిల్లా అధికారులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

- ఒంగోలులో ఉత్సాహంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం

ఒంగోలు: అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని ఒంగోలులోని మినీ స్టేడియంలో శనివారం ఉదయం ఉత్సాహంగా నిర్వహించారు. ఒంగోలు మినీ స్టేడియంలో శనివారం ఉదయం నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగాచార్యుడు ఏడుకొండలు ఆధ్వర్యంలో యోగ ఔత్సాహికులతో కలసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ యోగా గొప్పతనాన్ని, ప్రయోజనాలను ప్రజలకు అందించాలన్న ప్రధాని మోదీ ఆలోచనలకు అనుగుణంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఆత్మను, మనసును, శరీరాన్ని ఏకం చేసే ఏకైక సాధనం యోగా అని, ప్రతి ఒక్కరూ తమజీవితంలో యోగాని భాగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. మే 21 నుంచి నెల రోజుల పాటు జిల్లాలో యోగాంధ్ర మాసోత్సవాలను ఘనంగా నిర్వహించినందుకు అన్నీ శాఖల అధికారులు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు, యోగ సాధకులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో జిల్లాకు చెందిన ఏడుగురు గెలుపొందడం సంతోషదాయకమన్నారు. యోగ సాంగ్‌కు రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మొదటి బహుమతి వచ్చిందని చెప్పారు. యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన జిల్లా అధికారులకు, యోగ సాధకులకు మెమొంటోలు ప్రదానం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. మినీ స్టేడియం ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు నారాయణ, శ్రీహరి, డీఈఓ కిరణ్ కుమార్, పశు సంవర్ధక శాఖ జేడీ రవి కుమార్, డీఎస్ఓ పద్మశ్రీ, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఎస్డీఓ రాజరాజేశ్వరి, ఆయుష్ ఆర్డీడీ పద్మజాతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగముద్రలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

క్లుప్తంగా

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా మాణిక్యరావు



సూపరింటెండెంట్ మాణిక్యరావుకు అభినందనలు తెలుపుతున్న జీజీహెచ్ అధికారులు

ఒంగోలు టౌన్: స్థానిక జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాణిక్యరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన వచ్చారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.తిరుపతిరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ కె.అద్దెయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కిరణ్ కుమార్, ఆర్‌ఎంఓ డా.మాధవీలత, ఏఆర్‌ఎంఓ డా.చెంచయ్య, తదితరులు మాణిక్యరావును కలిసి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతిచెందిన భరత్ కుమార్

కొత్తపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతిచెందాడు. కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన మిట్నసల భరత్ కుమార్ (54) అల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ పాఠశాలలో పని పూర్తి చేసుకుని టీవీఎస్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లే సమయంలో కొత్తపట్నం నుంచి ఒంగోలు వైపు ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వెళ్తూ వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భరత్ కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మరో ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం భరత్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు మిట్నసల శరత్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపట్నం ఎస్సై సుధాకర్‌బాబు తెలిపారు.

కబళించిన అతివేగం



తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు



రిషికేష్



హన్విక

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
- భర్త, ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు
- ట్రాన్స్‌పోర్ట్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టి నుజ్జునుజ్జయిన కారు
- బేస్తవారిపేట మండలం చెట్టిచర్ల సమీపంలో ఘటన



నుజ్జునుజ్జయిన కారు



మృతిచెందిన అరుణ

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందగా, ఆమె భర్త, ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. ఒంగోలు–నంద్యాల హైవేపై బేస్తవారిపేట మండలంలోని చెట్టిచర్ల సమీపంలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి కడప వెళ్తున్న క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ లారీని టాయిలెట్ కోసం హైవే పక్కన చెట్టిచర్ల సమీపంలో డ్రైవర్ ఆపాడు. అదే సమయంలో బాపట్ల జిల్లా పొన్నలూరు నుంచి నంద్యాలకు కారులో ఐ.శ్రీనివాసులు, అతని భార్య అరుణ (29), ఇద్దరు పిల్లలు రిషికేష్, హన్విక వెళ్తున్నారు. వేగంగా వెళ్తున్న వీరి కారు హైవే మార్జిన్‌లో నిలిపి ఉంచిన ట్రాన్స్‌పోర్ట్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. లారీ వెనుక వైపు కూరుకుపోయిన కారు నుజ్జునుజ్జయింది. ముందుసీట్లో కూర్చుని ఉన్న అరుణ అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవింగ్ చేస్తున్న ఆమె భర్త శ్రీనివాసులు, వెనుక కూర్చుని ఉన్న పిల్లలు రిషికేష్, హన్వికలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన వారిని హిటాచ్ యంత్రం సాయంతో బయటకు తీయించారు. అప్పటికే అరుణ మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు, రిషికేష్, హన్వికలను హైవే అంబులెన్స్‌లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి గుంటూరు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనివాసులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ విత్తన కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

గంజాయి కేసులో ఆరుగురు అరెస్టు



గంజాయిని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

గిద్దలూరు రూరల్: గంజాయి కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. మండలంలోని వెంగళరెడ్డిపల్లెకు చెందిన బిజ్జం వెంకట శ్రీరాంరెడ్డి అలియాస్ ఇంద్రసేనారెడ్డి, కె.ఎస్.పల్లెకు చెందిన మొలక మోహన్‌కృష్ణ, పాదలకుంటపల్లె గ్రామానికి చెందిన కాకాని నరేంద్ర, బేస్తవారిపేట మండలం చెన్నుపల్లెకు చెందిన లక్కంనేని వెంకట సుబ్బయ్య, తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన కొవ్వూరి ఉదయ్‌భాస్కర్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పాండేయే గ్రామానికి చెందిన అడ్కటీయ రంజీత్‌లను గంజాయి కేసులో గిద్దలూరు ఒంగోలు హైవే రోడ్డులోని పాత ఎస్‌ఆర్ పెట్రోల్ బంకు వద్ద అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వారి నుంచి 6 కిలోల గంజాయితో పాటు రూ.60 వేల నగదు, తూకం పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గిద్దలూరు మండలం వెంగళరెడ్డిపల్లెకు చెందిన బిజ్జం వెంకటశ్రీరాంరెడ్డి అలియాస్ ఇంద్రసేనారెడ్డి, కె.ఎస్.పల్లెకు చెందిన మొలక మోహన్‌కృష్ణ, పాదలకుంటపల్లె గ్రామానికి చెందిన కాకాని నరేంద్ర, బేస్తవారిపేట మండలం చెన్నుపల్లెకు చెందిన లక్కంనేని వెంకట సుబ్బయ్యలు చెడు అలవాట్లకు బానిసలై డబ్బును సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని విక్రయించేందుకు సిద్ధపడ్డారు. ఈ నేపథ్యంలో వీరు నలుగురు గంజాయిని తూర్పుగోదావరి జిల్లా ఉదయ్‌భాస్కర్ ద్వారా ఒడిశాకు చెందిన రంజీత్‌ల వద్ద నుంచి కిలో గంజాయిని రూ.10 వేల ప్రకారం కొనుగోలు చేసి గిద్దలూరు పరిసర ప్రాంతాలల్లో 10 గ్రాముల గంజాయిని రూ.500 ప్రకారం విక్రయిస్తుంటారని తమ విచారణలో వెల్లడైందని డీఎస్పీ నాగరాజు వివరించారు. సీఐ కె.సురేష్, ఎస్సై శివనాంచారయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి



కంభం: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి కంభం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. మేకల నవమ్మ (45) అనే మహిళ బెంగళూరు నుంచి అర్ధవీడు మండలం దొనకొండ వెళ్లేందుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చింది. కంభం రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ జారి కింద పడి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

వైభవంగా గాయత్రి మహాయజ్ఞం



గాయత్రి మహాయజ్ఞంలో భారీగా పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో గాయత్రి మహాయజ్ఞాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం షిరిడీ సాయిబాబా మందిరం వద్ద నుంచి వేదమాత గాయత్రి మహాపీఠం రథయాత్ర నిర్వహించారు. కలశాలతో సామూహికంగా పాల్గొన్న మహిళా భక్తులతో స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూల్ వరకు శోభాయాత్ర జరిగింది. అనంతరం పీవీఆర్ హైస్కూల్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన సహస్రదీప యజ్ఞంలో మహిళా భక్తులు భారీగా పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదు

ఒంగోలు టౌన్: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం ఈవ్‌టీజింగ్ చేస్తున్న 24 మందిని గుర్తించి ఒంగోలులోని డీఎస్పీ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నగరంలో ఈవ్‌టీజింగ్‌ను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈవ్‌టీజింగ్ అనేది సరదాగా చేసేది కాదని, మహిళల మనోస్థైర్యాన్ని దెబ్బతీసే క్రూరమైన చర్య అని అభివర్ణించారు. మహిళలు, బాలికలు, విద్యార్థినుల వెంటబడి వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా యువత ఎదగాలని సూచించారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించడం, వారి హక్కులను గుర్తించడం ప్రతిఒక్కరి కనీస బాధ్యతని అన్నారు. రాత్రి సమయంలో కొంతమంది ఆకతాయిలు బైకులకు మోడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దం చేస్తూ వీధుల్లో తిరుగుతున్నారని, వారి మీద ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అలాంటి వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి సమయంలో కాలేజీ విద్యార్థులు బయట తిరుగుతున్నారన్న సమాచారం ఉందని, కాలేజీ యాజమాన్యాలు, కాలేజీకి చెందిన హాస్టల్ వార్డెన్ల ద్వారా వారిని గుర్తిస్తున్నామని తెలిపారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా స్థానిక పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయాలని, డయల్ 112, 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సిలింగ్‌లో ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ, ఎస్సైలు సువర్ణ, రావణమ్మ, సుబ్రహ్మణ్యం, సాంబశివరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

సింగరాయకొండ: విద్యుత్ గృహ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనం కింద సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని సాయిబాబా గుడి సమీప ఫంక్షన్ హాలులో శనివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జల, థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణ నీరు, బొగ్గు కొరతతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని, బొగ్గు నిల్వలు తగ్గిపోతున్నాయని, బొగ్గు తవ్వకాల ప్రాంతాల్లో భూకంపాలు వచ్చే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్, విండ్, హైడ్ పవర్ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని, వీటితో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని గుర్తు చేశారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం యూనిట్ సామర్థ్యం అత్యధికంగా సుమారు 75 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తుందని గుర్తు చేశారు. సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుందన్నారు. దేశంలోని గుజరాత్, బీహార్, కేరళ రాష్ట్రాల్లో భారీగా సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేసుకున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చాలా తక్కువ మంది ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. ప్రజల్లో సోలార్ సిస్టంపై అవగాహన కల్పించి ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ 2026 నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు సుమారు 350 కోట్ల రూపాయలు ఉండగా కేవలం కలెక్టరేట్ కార్యాలయంలో సుమారు 5 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా సోలార్ సిస్టం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు వివరించారు. కందుకూరు డీఈ ఎం.నాగేశ్వరరావు, ఏడీఈ యుగంధర్, ఏఈ సాంబశివరావు, హర్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ పాండురంగారావు

ఒంగోలు టౌన్: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు హెచ్చరించారు. శనివారం ఒంగోలు నగరంలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న 35 మంది మైనర్లను గుర్తించారు. వారితో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పాండురంగారావు మాట్లాడుతూ పిల్లల మీద ప్రేమ ఉంటే వారికి వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. ప్రేమ, గారాబం కంటే ప్రాణాలు ఎక్కువనే విషయం తల్లిదండ్రులు గుర్తించాలని హితవు పలికారు. చిన్నపిల్లలకు ఎలాంటి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్టులు తప్పనిసరిగా ధరించాలని, అతివేగంగా వాహనాలను నడపరాదని, మొబైల్ ఫోన్లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. మైనర్లు వాహనం నడిపినా, మైనర్లకు వాహనం ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌన్సిలింగ్‌లో ట్రాఫిక్ ఎస్సై కోటయ్య, ఆర్ఎస్సై మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై చర్యలు

ఒంగోలు టౌన్: సోషల్ మీడియాలో అసభ్యకర, ఎదుటి వ్యక్తులను అవమానించే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించే ర్యాలీలు, ఊరేగింపులు, సభలు సమావేశాల్లో ఎదుటి వారిని రెచ్చగొట్టడం, కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించినా, నినాదాలు చేసినా, ఫ్లెక్సీలు, పోస్టర్స్, ప్లకార్డ్స్ ప్రదర్శించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాయపాటి స్పష్టం చేశారు.

కార్గో సేవలు కొనసాగింపు

ఒంగోలు టౌన్:

సింగరాయకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో కార్గో సేవలు కొనసాగిస్తున్నట్లు ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కౌంటర్ నిర్వహించిన ఏజెంట్‌పై ఆర్థిక ఆరోపణలు రావడంతో అతడిని తొలగించామని, తాత్కాలికంగా కార్గో సేవలకు అంతరాయం కలిగిందని వివరించారు. కస్టమర్లకు అసౌకర్యం కలగకుండా వెంటనే కొత్త ఏజెంట్‌ను నియమించినట్లు తెలిపారు. సింగరాయకొండ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.